లోకల్.. నాన్ లోకల్ వివాదం
28కి వాయిదాపడ్డ వాహనాల పార్కింగ్ టెండర్

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లోని దేవునితోటలో గల భవాని శంకర ఆలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ టెండర్ వివాదంగా మారింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన టెండర్ కార్యక్రమంలో లోకల్ నాన్ లోకల్ వివాదం వల్ల ఈ నెల 28వ తేదీన మరోసారి నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. భవాని శంకర ఆలయ ప్రాంగణంలో వాహనాలను పార్కింగ్ చేసేందుకు ప్రతియేటా టెండర్‌లు ఆహ్వానిస్తారు. అందులో భాగంగా పత్రికలలో ప్రకటనలు ఇచ్చి టెండర్‌ను ఆహ్వానించగా కొంతమంది వ్యాపారులు, స్థానికులు, స్థానికేతరులు టెండర్ వేలం పాడేందుకు హాజరయ్యారు. అప్పటికే ఏర్పాటు చేసిన వేదిక వద్ద కొంత మంది వేలాంపాటపై భవాని శంకర ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్, దేవాదాయ శాఖ ఈవో జ్యోతి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'మేము స్థానికంగా ఉంటాం. మాకే టెండర్ ఇవ్వాలని కొంతమంది, మాకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని మరికొంత మంది, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి టెండర్‌లో ఎలా పాల్గొంటారు' అని ఇంకొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అందరి అభిప్రాయాల మేరకు ఈనెల 28న మరోసారి వేలంపాట నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీక్రాస్‌రోడ్, ఎర్రమంజిల్,నాసర్ స్కూల్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, లేపాక్షి, ఐసీ క్వార్టర్స్, కేర్ ఆస్పత్రి పరిధుల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఆజామాబాద్ పరిధిలో 3.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు బోనాల చెక్కుల పంపిణీ

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాల సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని అమ్మవారి దేవాలయాలకు ప్రతియేటా దేవాదాయ శాఖ అందజేసే ఉత్సవాల నిర్వహణ చెక్కులను గురువారం ఉదయం 10గంటలకు అందజేయనున్నట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని భవాని శంకర ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఆరు డివిజన్ల కార్పొరేటర్లు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.

నేడు గురుపౌర్ణమి పూజలు

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా ముషీరాబాద్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే సద్గురు సాయినాథుడికి సామూహిక పూజ నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్‌ముషీరాబాద్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌ను ఈ పూజలకు ఆహ్వానించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మహాకాళిదేవాలయ ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి, వివిధ పార్టీల నేతలు హాజరవుతారని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఆప్ బహిరంగ లేఖ

కవాడిగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలవడానికి ఆప్ ప్రతినిధి బృందానికి సమయం ఇవ్వాలని లేదా సచివాలయంలో బైఠాయిస్తామని ఆమ్ ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం బహిరంగ లేఖ రాశారు.

తానా సభల్లో ధర్మారావుకు ఘన సత్కారం

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచఅత్యున్నత తెలుగు సాంస్కృతిక, సేవా సంస్థ తానా ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన 24వ తానా ద్వైవార్షిక సభల ప్రధానవేదికపై హైదరాబాద్ నగర సాంస్కృతిక, సినీ,సేవాప్రముఖులు ఇట్‌క్లా, ఫాస్ ఫిలిం సొసైటీల ప్రధాన నిర్వాహకులు డా.కె. ధర్మారావును ఘనంగా సత్కరించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఇట్‌క్లా కార్యాలయంలో చైర్మన్, దక్షిణమధ్యరైల్వే పూర్వజీఎం సి.రామకృష్ణ విలేకరులకు తెలిపారు. తానా సభల చైర్మన్ గంగాధర్ నాదెళ్ల, తానా పూర్వ అధ్యక్షులు జయరామ్ కోమటి అవార్డుతో సత్కరించారు. కోఆర్డినేటర్ ఉదయకుమార్ చాపలమడుగు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు విస్తృతంగా ఫాగింగ్: డీఎంసీ

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా ఫాగింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి తెలిపారు. బుధవారం ముషీరాబాద్‌లో జరిగిన ఫాగింగ్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ సుప్రియతో కలిసి పరిశీలించారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాలేజీ కోర్సులలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మూడు సంవత్సరాల ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీమ్‌లు ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఇందులో భాగంగా ట్రస్ట్ బ్యాంకు ప్రతిపాదనను తీసుకొస్తుందని ఆరోపించారు.

సాయి అప్నా డ్రైవింగ్ స్కూల్ యజమానిపై కేసు

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలో సాయి అప్నా డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్న యజమాని పెంట రమేష్‌పై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చిన ఓ మహిళను పెంట రమేష్ లైంగికంగా వేధించడంతో ఆమె బుధవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రమేష్‌పై బీఎస్ఎస్75 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూడు నెలల్లో వంజర సంఘం భవనం పూర్తి

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉప్పల్‌భగాయత్‌లో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న తెలంగాణ వంజర సంఘం భవనం మూడు నెలల్లో పూర్తవుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేష్, ప్రధానకార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ తెలిపారు. బుధవారం అంబర్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తమ సంఘానికి ఉప్పల్‌భగాయత్‌లో స్థలంతో పాటు రూ.10 కోట్ల నిధులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కల్పించారని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీన వంజర కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాలేరు రామోజీ, ఆంజనేయులు, విజయ్‌కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల నిర్వహణలో నిబంధనలు పాటించాలి: ఏసీపీ

చిక్కడపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): లాడ్జీల నిర్వహణలో లాడ్జీల-2024 పబ్లిక్ సేఫ్టీ చట్టంప్రకారం యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ సూచించారు. బుధవారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలోని తన కార్యాలయంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్, రెండు పీఎస్‌ల డీఐలు ఎం.శంకర్, ఎండీ నదీమ్‌హుస్సేన్‌తో కలిసి చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధుల్లో ఉన్న 10 లాడ్జీల యాజమాన్యాలు, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. లాడ్జీల నిర్వహణలో అన్ని నిబంధనలు పాటించాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు ఇవ్వొద్దని సూచించారు. అపరిచితుల విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని, ఎలాంటి అనుమానంవచ్చినా తమకు సమాచారం అందించాలన్నారు. లాడ్జిల్లో గంజాయి తదితర మాదకద్రవ్యాలను తెస్తే వారిని అనుమతించవద్దని ఏసీపీ తెలిపారు.

● విద్యార్థుల కేబినెట్ సమావేశం



డీడీ కాలనీలోని అకాడమిక్ హైట్స్ క్రేమ్‌బ్రిడ్జి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఫ్లాగ్‌లు, జెండాలను అందజేసి విద్యార్థులకు బాధ్యతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, ప్రిన్సిపాల్ యామని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

ప్రైవేటు వైద్య సంస్థలు పేద ప్రజలకు
మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే ముఠాగోపాల్



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు వైద్య సంస్థలు పేదప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి మెరుగైన వైద్యం అందించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ పార్శిగుట్ట వద్ద గల ప్రేయర్ పవర్ చర్చ్‌లో చర్చ్ వ్యవస్థాపక సభ్యురాలు ఎస్తేర్ రాణి వర్ధంతి సందర్భంగా కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు వైద్య సంస్థలు మానతవ దృక్పథంతో పేదలకు వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌దీపక్, ఆలిండియా ప్రేయర్‌పవర్ చర్చ్ డైరెక్టర్ శ్యామ్ అబ్రహం, క్రిష్టియన్ జాయింట్‌యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సాల్‌మూన్‌రాజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌సాగర్, నగర కార్యదర్శి ఆర్ మోజెస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కెనడీ, డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడి తదితరులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో కళాధర్‌నగర్ పార్కు అభివృద్ధి: ఎమ్మెల్యే

ముషీరాబాద్ డివిజన్ కళాధర్‌నగర్‌లో గల జీహెచ్‌ఎంసీ పార్కును రూ.15లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. బుధవారం కళాధర్‌నగర్ పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్ నాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ ఏఈ మురళి, జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ప్రహరీ నిర్మాణం, పార్కు చుట్టూ జాలీ తదితర అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు టి.తలారి శ్రీకాంత్ ముదిరాజ్, పూస గోరక్‌నాథ్, డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్, డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు ఎయిర్‌టెల్ రాజు, వంగాల నర్సింగ్‌రావు, బిజ్జి రావన్, నర్సింగ్ ముదిరాజ్, సందీప్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి
- రాజ్యాంగ హక్కులను రక్షించుకోవాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు



తిలక్‌నగర్ చౌరస్తాలో కేవీపీఎస్ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

గోల్నాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. రాజ్యాంగ, కార్మిక హక్కుల పరిరక్షణకు, దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా కార్మిక కర్షకులతో కలిసి సామాజిక శక్తులు సమైక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా అంబర్‌పేట తిలక్‌నగర్ చౌరస్తాలో కేవీపీఎస్ నాయకులు, కార్యకర్తలు నీలిజెండాలు చేబూని సమ్మెలో పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినదించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టి.స్కైలాబ్ బాబు, కేవీపీఎస్ నాయకులు ఎం.మహేందర్‌లు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లు చేసిందన్నారు. దీంతో కార్మికుల హక్కులు కాలరాయపడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం కోసం 252 జీవోను తీసుకువచ్చిందన్నారు. దీంతో 10 గంటల పని విధానాన్ని రుద్దే ప్రయత్నాలను కార్మిక వర్గం గట్టిగా వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి బిత్ర సుబ్బారావు, సీఐటీయూ అంబర్‌పేట జోన్ కార్యదర్శి జి.రాములు, సోమన్న, కేవీపీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..



నారాయణగూడలో ఐఎన్‌టీయూసీ నేతల ర్యాలీ

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్‌డీ.చంద్రశేఖర్, ఎ.నాగన్న గౌడ్, ఆదిల్‌షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నారాయణగూడలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికుల సంక్షేమం కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, ఇది కార్మిక సంక్షేమానికి పూర్తి వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమనాగేంద్రమణి, విజయకుమార్‌యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేష్‌గౌడ్, కె.రాజారెడ్డి, అబ్రహం, కొండ అన్నపూర్ణ, శ్రీదేవి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్

అంబర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో సుమారు రూ.4 లక్షలవ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, న్యూ పటేల్‌నగర్‌లో బస్తీవాసుల అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. న్యూ పటేల్‌నగర్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే అధికారులను పిలిపించి, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్దార్థ్ ముదిరాజ్, నాయకులు ఆమనూరి సతీష్, లత మహేష్ ముదిరాజ్, సంతోష్ పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం
అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై స్థానిక సంస్థలలో ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కల్లు గీతాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఐయిలి వెంకన్నగౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు నుగూరి దుర్గయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌గౌడ్, బీసీ జనసైన్యం అధ్యక్షుడు సింగం నాగేశ్వర్‌గౌడ్, బీసీ రచయిత వేదిక అధ్యక్షుడు బైరు శేఖర్, ఎంబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పి.బడేసాబ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, బాలగౌని వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీమంత్రి శ్రీనివాస్

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి
అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనుకున్నది సాధించాలంటే విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ సూచించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో ప్రవిష్ట - 2025 కార్యక్రమం పేరిట విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యారంగంలో వస్తున్న నూతన అంశాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు ప్రతిభను కనబర్చాలన్నారు. పద్మశ్రీ, ఏపీ ప్రభుత్వ ఐటీ శాఖ మాజీ సలహాదారులు టి.హనుమాన్‌చౌదరి మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను మరవకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, జెన్‌ప్యాక్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సుమియా అజీజ్, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి శోభ, అవంతి విద్యా సంస్థల అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, కళాశాల డైరెక్టర్ జయప్రద, రాకేష్, అప్పారావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

పద్మ కాలనీలో నాలా ప్రహరీ పనులను పూర్తి చేయాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్



నాలాను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, అధికారులు రఘుప్రసాద్, రవికిరణ్ తదితరులు

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మకాలనీలో నాలా ప్రహరీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఇళ్లలోకి వరదనీరు రాకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శానిటేషన్ రఘుప్రసాద్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డితో కలిసి పద్మకాలనీలో నాలా ప్రహరీ, వరదనీటి, శానిటేషన్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షాకాలంలో సమస్యలను కమిషనర్‌కు వివరించారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నాలాల వల్ల వరదనీరు ఇళ్లలోకి రాకుండా, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణతోపాటు అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరి ఉత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న పోచంపల్లి రమణారావు

నల్లకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని పసన్నాంజేయస్వామి దేవాలయంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శాకాంబరి ఉత్సవాలను నిర్వహించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు నేతృత్వంలో సమితి ప్రతినిధులు స్వామి వారికి, అమ్మవారికి పూజలు చేశారు.

వైభవంగా లైబ్రరీ రేణుకాఎల్లమ్మ కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న లైబ్రరీ చైర్మన్, కార్యదర్శి, ఉద్యోగులు

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్‌లైబ్రరీ ఆవరణలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటేశ్వర్‌రెడ్డి, అవినాష్‌రావు, వెంకటేష్‌యాదవ్, రామ్మోహన్, మహేందర్, కృష్ణారెడ్డి, వరప్రసాద్, మహేష్, యాదమ్మ, చంద్రకళ, ప్రతిభారెడ్డి, జంగారెడ్డి, శ్రీకాంత్, కొక్కుల దేవేందర్, బుచ్చయ్య, శివయ్య, సుజాత, లలిత, సరస్వతి,దాతలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ దంపతులకు పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం పేరిట వివిధ రంగాల్లో రాణిస్తున్న దంపతులకు ఆదర్శ దంపతుల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం హాజరై, పురస్కారాలు బహూకరించారు. గంగోత్రి నిలయం చైర్మన్ జి.హనుమంతరావు అధ్యక్షత వహించిన సభలో వంశీ రామరాజు, లంక లక్ష్మీనారాయణ, గుదిబండి వెంకటరెడ్డి, త్రినాథరావు, రామరాజు శ్రీనివాసరావు, లక్ష్మీ శ్రీనివాస్, నిర్వాహకులు లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కళలకు వేదికగా గానసభ

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కళలకు వేదికగా త్యాగరాయ గానసభ నిలుస్తుందని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అన్నారు. వెన్నెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గానసభలో గానవిభావరి జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనార్దనమూర్తి గాయనీగాయకులను అభినందించారు. బృందావనం సుబ్రహ్మణ్యం సమర్పణలో గాయనీగాయకులు నూకల ప్రభాకర్ తదితరులు గీతాలను ఆలపించారు.

ఆకట్టుకున్న తెలుగు, హిందీ సినీగీత విభావరి



గాయని గీతామాధురిని సన్మానిస్తున్న శారదాసాయి, చంద్రశేఖర్ తదితరులు

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం త్యాగరాయగాన సభలో స్వరలహరి(యూఎస్‌ఏ), ఆనందభైరవి ఆధ్వర్యంలో తెలుగు, హిందీ సినీ గీతాల ఆలాపన కార్యక్రమం ఆకట్టుకునేలా నిర్వహించారు. ప్రముఖ గాయనీగాయకులు శ్రీరామ్ దూర్వాసులు, శారదాసాయి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సినీ నేపథ్యగాయని గీతామాధురిని సన్మానించారు. గరుడవేగ, తిరుమల కోపరేటివ్‌బ్యాంక్, కళాపోషకులు పురుషోత్తంరెడ్డి, మంచుకొండ ప్రకాశం, వడ్లకొండ వెంకటేశ్వరరావు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేమాని పార్థసారధి, సినీ దర్శకులు వీఎన్ ఆదిత్య, డి.చక్రపాణి, వడ్లకొండ వెంకట్రావు, సోమంచి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు



మ్యాన్‌హోల్ మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో కుంగిపోయిన మ్యాన్‌హోల్స్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డివిజన్‌లోని నింబోలిఅడ్డ మెయిన్ రోడ్‌పై డ్రైనేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె జలమండలి అధికారులతో బుధవారం మాట్లాడి మరమ్మతు పనులను చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అందించాలి



పేద విద్యార్థులకు ఉచితంగా లాంగ్ బుక్స్, పెన్సిళ్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి

నల్లకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పేదరికం వల్ల చాలా మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, అలాంటి విద్యార్థులను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని రమాబాయి మాలల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి కోరారు. బుధవారం రమాబాయి మాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని మోహన్‌నగర్, జమిస్తాన్‌పూర్ వంటి బస్తీలలో పేద విద్యార్థి పిల్లలకు లాంగ్ నోట్ బుక్స్, పెన్సిళ్లను ఉచితంగా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి సాముర్తి లక్ష్మీ, అల్వాల నిర్మలాదేవి, అల్వాల మల్లేష్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.